ప్రజాశక్తి
I
ఆదివారం 2 మార్చి 2025
అల్లూరి సీతారామరాజు

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి అనంతగిరి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద లబ్ధిదారులు చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తి చేసి, రోజు కనీసం 300 రూపాయలు కూలి అందే విధంగా కృషి చేయాలని ఎంపిడిఒ సూచించారు. శనివారం చిలకగెడ్డ కాశీపట్నం పంచాయతీ పరిధిలో జరుగుతున్న భూ అభివృద్ధి ఇంకుడు గుంతల పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

కెజిహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స

- మహిళ కడుపులోని 10 కిలోల కణితి తొలగింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా సేవలు అందిస్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రి గైనకాలజీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. ఒక మహిళ కడుపులో ఉన్న 10 కిలోల కణితిని తొలగించారు. వివరాల్లోకి వెళ్తే... 33 సంవత్సరాల వయస్సుగల ఒక మహిళ గత నెల 7న అవుట్ పేషెంట్ విభాగానికి హాజరయ్యారు. ఆమెకు ఒక సంవత్సరం నుంచి కడుపులో ఒక గడ్డ క్రమేపీ పెరుగుతూ విపరీతమైన నొప్పితో బాధపెడుతోంది. ఆమెను గైనిక్ విభాగంలోని 5వ యూనిట్‌లో అడ్మిట్ చేసి వైద్యులు పూర్తి పరీక్షలు నిర్వహించారు. కడుపు, పెల్విస్‌లకు అల్ట్రాసోనోగ్రఫీ, ఎంఆర్‌ఐ స్కానింగ్ నిర్వహించగా గర్భాశయంలో 34 వారాల పరిమాణంలో గడ్డ గడ్డను (కణితి) గుర్తించారు. గత నెల 18న గైనిక్ విభాగం వైద్యులు, అనస్థీషియా వైద్య బృందం అరుదైన శస్త్ర చికిత్స నిర్వహించి రోగి గర్భాశయంలోని 10 కిలోల కణితిని తొలగించి పేషెంట్‌ను రక్షించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. ఈ అరుదైన శస్త్రచికిత్సను గైనిక్ విభాగానికి చెందిన ప్రొఫెసర్లు డాక్టర్ రాజలక్ష్మి, డాక్టర్ సుజన, డాక్టర్ లీలా మాధురి, డాక్టర్ అనూష, డాక్టర్ నళిని, డాక్టర్ ఎవాంజెలిన్, డాక్టర్ లక్షిత, డాక్టర్ మాధురి, డాక్టర్ హేమలత, డాక్టర్ యోగిత, విజయ నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మీడియాకు తెలిపారు. శనివారం ఆయన గైనిక్ విభాగాన్ని సందర్శించి జటిలమైన అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందాన్ని అభినందించారు. ప్రస్తుతం ఆ రోగి ఆరోగ్యవంతంగా ఉన్నారని, రోగితో పాటు రోగి బంధువులు కూడా వైద్యులు అందించిన సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సేవలు అందించడంతోపాటు రోగులకు పూర్తిస్థాయిలో భద్రత, మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు జిల్లావ్యాప్తంగా శనివారం నుంచి ప్రశాంతంగా ప్రారంభమయ్యాయని డిఐఈఓ అప్పలరాము తెలిపారు. తొలి రోజు 93 శాతం హాజరు నమోదయిందన్నారు. విద్యార్థులు పరీక్షలు రాయడానికి మొత్తం జిల్లాలోని 26 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 7651 మంది విద్యార్థులకు గాను 6985 మంది హాజరుకాగా 666 మంది గైర్హాజరయ్యారు. అందులో జనరల్ విద్యార్థులు 6350 మందికి 5892 మంది హాజరు కాగా 458 గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్లో 1301 మందికి గాను 1093 మంది హాజరుకాగా 208 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. విద్యార్థులు ఉదయం 8.15 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత 8.30 గంటలకు పరీక్ష కేంద్రాల లోపలికి అనుమతించారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరిగాయి. మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదు. పరీక్షా కేంద్రాల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు చేపట్టారు. కేంద్రాల పరిసరాల్లో 144 సెక్షన్ అమలు చేశారు. జిరాక్స్ కేంద్రాలను మూసి వేయించారు.

డుంబ్రిగుడలలో పరీక్షా కేంద్రం ఆవరణలో విద్యార్థులు

డుంబ్రిగుడ: ఇంటర్ పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలకు సమయానికి ముందే చేరుకుని వారికి కేటాయించిన గదుల్లో చేరుకున్నారు. 251మందికిగాను కేజీబీవీ నుంచి 39, జూనియర్ కళాశాల నుంచి 212 మంది విద్యార్థులకు గాను 14 మంది గైర్హాజయ్యారు.

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ పరీక్షలు సీసీ కెమెరాలు నిఘా నీడలో శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ వి.శంకర్రావు, డిపార్మెంట్లు అధికారి కెవి.రత్నం విలేకరులతో మాట్లాడుతూ శనివారం జరిగిన ప్రథమ ఇంటర్ పరీక్షలకు 57 మంది విద్యార్థులకు గాను 55 మంది హాజరైనట్లు చెప్పారు. స్థానిక ఎస్సై కే రవీంద్ర పర్యవేక్షణలో భద్రత కట్టు దిట్టడం చేసినట్లు తెలిపారు.

రాజవొమ్మంగి : స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శనివారం జరిగిన ఇంటర్ పరీక్షలకు 18 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రం సూరింటెండెంట్ సంతోష్ కుమారి తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన 333 మంది విద్యార్థులు తెలుగు, ఒకేషనల్ కోర్సు పరీక్షలు రాయాల్సి ఉండగా, 315 మంది హాజరైనట్లు చెప్పారు. రాజవొమ్మంగి ఎస్ఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రంపచోడవరం : రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇంటర్ విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తరలించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

మాస్టర్ ట్రైనర్ సుకుంజు బీహారీని సత్కరిస్తున్న ఐటిడిఎ పిఒ సింహాచలం

కొబ్బరి చిప్పలతో వస్తువుల తయారీపై శిక్షణ

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

కొబ్బరి చిప్పల ద్వారా వివిధ రకాల వస్తువులు తయారీపై ఏజెన్సీలోని యువతీ యువకులకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఆరు రోజుల పాటు శిక్షణ ఇచ్చినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. మండలంలోని పందిరి మామిడి హార్టికల్చర్ పరిశోధన కేంద్రంలో శిక్షణ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 23 నుండి 28వ తేదీ వరకు 15 మంది యువతి యువకులకు ఆరు రోజులపాటు గృహాల్లో అలంకరణ కొరకు వివిధ రకాలైన వస్తువులు తయారీపై ఈ పరిశోధన కేంద్రం ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ శిక్షణలో 13 రకాలైన వస్తువులు తయారీ ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. శిక్షణలో పాల్గొన్న వారికి 13 రకాలైన ఉపకరణాలు, సర్టిఫికెట్లు, రోజుకు రూ.250 చొప్పున ఖర్చుల నిమిత్తం అందజేసినట్లు తెలిపారు. ఈ కొబ్బరి చిప్పల వస్తువులు తయారీపై విడివికె గ్రూపును ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఒక్కొక్క గిరిజన రైతుకు 10 నుండి 20 కొబ్బరి మొక్కలు రెండు సంవత్సరాలలో 20 వేల కొబ్బరి మొక్కలు సరఫరా చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. పందిరి మామిడి ఉద్యానవన పరిశోధన కేంద్రం ద్వారా ఉద్యానవన పంటల మొక్కలపై రానున్న రోజుల్లో యువతీ యువకులకు ఉద్యానవన పంటల పరిశోధకులు డాక్టర్ పి.వెంగయ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. కొబ్బరి చిప్పల వస్తువులు తయారీ మాస్టర్ ట్రైనర్ సుకుంజు బీహారికి ప్రాజెక్ట్ అధికారి సన్మానం చేశారు.

బడ్జెట్‌లో ఐటిడిఎలకు కేటాయింపులు ఏవీ?

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర బడ్జెట్ కేటాయింపుల్లో ఆదివాసీలకు కూటమి ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేసిందని, దామాషా ప్రకారం 5.53 శాతం నిధులు కేటాయించాలని, కానీ కేవలం 2.48శాతం మాత్రమే కేటాయించి, గొప్పలు ప్రచారం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పై శనివారం విలేఖర్లతో ఆయన మాట్లాడుతూ, ఎస్టీ సబ్ ప్లాన్ కు 5.53శాతం నిధులు కేటాయించలేదన్నారు. 275 క్లాజ్ 1 ప్రకారం రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలకు 8 ఐ.టి.డి.ఏల ద్వారా పాలన జరుగుతుందని వాటికి కేవలం 100కోట్లు కేటాయించి ఉత్సవ విగ్రహాలుగా మార్చేసిందని విమర్శించారు. ప్రతి ఐ.టి.డి.ఏకు 100కోట్లు రూపాయిల చొప్పున కేటాయించాలని డిమాండ్ చేశారు. కాఫీ రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడానికి ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాలకు కోరిన పట్టించుకోలేదని అటవీ,వ్యవసాయ, కాఫీ ఉత్పత్తుల కొనుగోలు కోసం, జి.సి.సి ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు ప్రభుత్వం కేటాయించిన 20 లక్షల రూపాయలు సరిపోదన్నారు. ఈ ఏడాది కూడా కాఫీ రైతులకు సకాలంలో గిట్టుబాటు ధరను జి.సి.సి కల్పించక పోవడంతో ఇప్పటికీ జి.సి.సి టార్గెట్ తగ్గటుగా కాఫీ పంట సేకరణ జరగలేదన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం ఆదివాసీ స్పెషల్ డిఎస్సీ నియామకానికి, నూరు శాతం ఉద్యోగ ఉపాధ్యాయ రిజర్వేషన్ గుర్చి కూడా బడ్జెట్ లో కనీసం ప్రస్తావన చేయలేదన్నారు. గిరిజన గురుకులంలో విధులు నిర్వర్తిస్తున్న ఆదివాసీ అధ్యాపక, ఉపాద్యాయ లకు రెగ్యులైజేషన్ చేయడానికి కూడా నిధులు కేటాయింపు లేదన్నారు.

గిరిజన సంక్షేమానికి గత బడ్జెట్ లో 4,561 కోట్లు కేటాయించి, మళ్ళీ సవరించి 129 కోట్ల రూపాయల ను తగ్గించారని, ప్రస్తుత బడ్జెట్ లో 4671 కోట్లు రూపాయిలు కేటాయించి, సవరణ బడ్జెట్ వచ్చేసరికి మరింత తగ్గించే అవకాశం ఉందని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 1424 కోట్లు రూపాయిలతో సమస్యలు పరిష్కారం కాదని 18వేల కోట్ల రూపాయల కేటాయించాలన్నారు.తాగు నీరు, డోలి మోత మొదలగు సమస్యలు పరిష్కారం చేయాలని కోరారు.

కార్మికులకు మొండి చెయ్యి : సిఐటియు

పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో కార్మిక వర్గానికి కేటాయింపుల్లో తీవ్రమైన అన్యాయం జరిగిందని సిఐటియు అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ విమర్శించింది. ఈ మేరకు శనివారం పాడేరు సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల జీతాలు పెరుగుతాయని ఎదురు చూశారనీ, వారి ఆశలకు ఈ రాష్ట్ర ప్రభుత్వం అడియాస చేసిందని అన్నారు. కార్మికులకు జీతాలు పెంచుతున్నామని ప్రసంగంలో మాట్లాడలేదని తెలిపారు. ఆశా కార్యకర్తలకు జీతాల పెంపు ప్రస్తావనలేదని విమర్శించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల్ని ఆదుకుంటామని చెప్పిన మాట ప్రకారం సంక్షేమ బోర్డు పునరుద్ధరణపై ఊసే లేదని అన్నారు. లక్షలాదిమంది పనిచేస్తున్న సమగ్ర శిక్ష, నేషనల్ హెల్త్ మిషన్ , ఇతర ప్రభుత్వ పథకాల్లో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు జీతాల పెంపు ప్రస్తావన లేదని తెలిపారు. ఈ బడ్జెట్ కష్టజీవులకు కాకుండా ధనవంతులకి ఉపయోగపడే విధంగా ఉందని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం అప్పులు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టిందని చెబుతూనే ఈ బడ్జెట్లో కూటమి ప్రభుత్వం కూడా 80 వేల కోట్లు అప్పు చేయాలని ప్రతిపాదించారని తెలిపారు. ఇప్పటికైనా శ్రమజీవులకు, వేతన కార్మికులకు బడ్జెట్లో సవరణలు చేసి వారి సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సన్నిబాబు, భగత్ రామ్, సహాయ కార్యదర్శి జెనబందు, శంకర్రావు, ఎస్‌బి పోతురాజు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

నిర్మాణంలో ఉన్న గోకులం షెడ్లును పరిశీలించిన పశుసంవర్ధకశాఖ అధికారి అహ్మాద్ షరీఫ్

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

ప్రజాశక్తి-గంగవరం

మార్చి 1 నుండి 31 వరకు పశువులకు వ్యాధుల నిరోధక టీకాల కార్యక్రమం చేపట్టామని, దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు అహ్మాద్ షరీఫ్ అన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి, బసెల్లాసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు పాడిపశు పోషణ ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు. పశుసంపదకు విధిగా ఇన్సూరెన్స్ చేయించుకోవడం ద్వారా పశువులు నష్టపోయిన రైతులకు ఆర్థికంగా ఇబ్బంది కలగకుండా ఉంటుందని తెలిపారు. అనంతరం ఆయన కుసుమరాయిలో ఉపాధి హామీ చట్టం ద్వారా రైతులకు నిర్మిస్తున్న గోశాలను పరిశీలించారు. కార్యక్రమంలో నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పరిశిక అప్పన్న బాబు, లైవ్ స్టాక్ అసిస్టెంట్లు అనంతలక్ష్మి, రాజు, సాంబమూర్తి పాల్గొన్నారు.

పాడేరులో ర్యాలీని ప్రారంభిస్తున్న జెసి

బాలికల రక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- జెసి అభిషేక్‌గౌడ్

ప్రజాశక్తి -పాడేరు: మహిళా సాధికారిత దిశగా ప్రతి మహిళా అడుగులు వేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎం జే అభిషేక్ గౌడ్ సూచించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురష్కరించుకుని నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా శనివారం బేటీ బచావో, బేటీ పడావో పేరుతో స్థానిక అంబేద్కర్ కూడలి నుండి ఐటిడిఎ వరకు నిర్వహించిన ర్యాలీని జేసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ, ప్రతి మహిళా తన స్వంత కాళ్ళపై నిలబడేందుకు కృషి చేయాలని సూచించారు. బాలికల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి గల హక్కులు, రక్షణ చట్టాల గూర్చి అవగాహన కల్పించాలని ఆదేశించారు. మహిళా సాధికారతతోనే ఆర్థిక వ్యవస్థ మెరుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ పి.ఝాన్సి రాణి, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎల్. రజని, డిఎంహెచ్ఒ జమాల్ బాషా, డిఇఒ పి. బ్రహ్మాజీరావు, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, ఎంఇఒ సరస్వతి పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు ప్రారంభం

సీలేరు: మండల కేంద్రం జీకే వీధిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహిళల ఆవశ్యకత తెలుపుతూ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా వారోత్సవాలు మార్చి ఒకటి నుండి 8వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మహిళల హక్కులు సమానత్వం సాధికారికపై అవగాహన కల్పించామని తెలిపారు. జీకే వీధి మండలం పరిధిలో 2003 అంగన్వాడీ కేంద్రాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సాయంత్రం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రామలక్ష్మి, వలసమ్మ, కృష్ణకుమారి, అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులు, తల్లిదండ్రులు, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

గంగవరం : మహిళా దినోత్సవం పురస్కరించుకొని గంగవరం మండలం లక్కుండ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్వాడి, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఆడపిల్ల చదువు దేశానికి వెలుగు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఘుబాబు దొర, ఉపాధ్యాయులు సుజాత, అంగన్వాటీ టీచర్లు రమణమ్మ, వీర రాఘవమ్మ, ఏఎన్ఎం కృష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగవరంలో ర్యాలీ చేపడుతున్న టీచర్లు, పిల్లలు

తక్షణమే గ్రామసభలు నిర్వహించాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సీతారామయ్య

ప్రజాశక్తి-కూనవరం

ప్రభుత్వం, అధికారులు ప్రకటించిన విధంగా వెంటనే గ్రామసభలు నిర్వహించే ప్రయారిటీ గ్రామాల నిర్వాసితులకు న్యాయం చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మార్త శ్రీరామ్మూర్తి భవన్‌లో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో సీతారామయ్య మాట్లాడుతూ ప్రయారిటీ గ్రామాల పేరుతో జరుగుతున్న దోబూచులాటను ఇకనైనా ఆపాలని హితవు పలికారు. మార్చి 8వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండగా పోలవరం నిర్వాసిత గ్రామసభలు మార్చి ఒకటి నుండి మూడు వరకు జరుగుతాయని ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. స్ట్రక్చర్ వ్యాల్యూలో అనేక లోపాలు ఉన్నాయని, ఇంకా వందల గృహాలకు వ్యాల్యుయేషన్ చేయాల్సి ఉందని తెలిపారు. ఆర్ అండ్ ఆర్‌లో చేర్చాల్సిన 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులు వందలాదిమంది అధికారులు ప్రకటించిన పిడిఎఫ్‌లో కనిపించడం లేదని పేర్కొన్నారు. తక్షణమే గ్రామసభలు జరపాలని, 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్‌ఆర్ ప్యాకేజీ స్ట్రక్చర్ వ్యాల్యూషన్ పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రయారిటీ గ్రామాలలోని ఆర్ అండ్ ఆర్ పేర్లు నమోదు కాని వందలాదిమంది నిర్వాసితులను తక్షణమే నమోదు చేయాలని, గ్రామాలు తరలించే నాటికి 18 సంవత్సరాల నుండి యువతీ యువకులకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, మండల కమిటీ సభ్యులు తాళ్లూరు శ్రీనివాసరావు, మడెం బాబురావు, ఎంపీటీసీలు జయసుధ, అమ్మాజీ, పెద్దార్కూర్ సర్పంచ్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య

మహిళా దినోత్సవం సందర్భంగా ఓపెన్ హౌస్

విద్యార్థినులతో మాట్లాడుతున్న చింతూరు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా

ప్రజాశక్తి-చింతూరు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చింతూరు ఏఎస్‌పి కార్యాలయంలో శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. డిగ్రీ విద్యార్థినిలకు ఎఎస్‌పి పంకజ్ కుమార్ మీనా, సిఐ దుర్గాప్రసాద్ పోలీసు సేవలపై అవగాహన కల్పించారు. మార్చి 1 నుండి 8వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. పోలీస్ స్టేషన్‌లో మహిళల హక్కులు, మహిళా సాధికారిత, మహిళా చట్టాలు, విద్యార్థినులపై ర్యాగింగ్ తదితర అంశాలపై తెలియజేశారు. ఆఫీస్ నిర్వహణ, లాకప్, సాంకేతిక నిర్వహణ, ఆయుధాలు వినియోగంపై అవగాహన కల్పించారు. పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలని, మావోయిస్టులకు, వారి భావాలకు దూరంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యస్ఐ రమేష్, ఏఎస్ఐలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, సిపిఎం నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాస్‌రావు, శాపిడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ అహమద్ అలీ తదితరులు పాల్గొన్నారు

అడ్డతీగల : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థినులకు పోలీసు సేవలపై అవగాహన కల్పించడానికి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో శనివారం మధ్యాహ్నం ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల ఆశ్రమ బాలికల పాఠశాల విద్యార్థినులు ఈ ఓపెన్ హౌస్‌ను తిలకించారు. పోలీస్ స్టేషన్లో విధి విధానాలు, ఆయుధాలు, వాటి వినియోగం తదితర వాటి గురించి విద్యార్థులకు అడ్డతీగల సిఐ బి.నరసింహారావు, దుచ్చెర్తి ఎస్సై ఎం.వెంకయ్య వివరించారు.

రాజవొమ్మంగి : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల రక్షణ చట్టాలపై స్థానిక సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ నరసింహమూర్తి బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పనితీరు, బాలికల రక్షణ చట్టాలను వివరించారు. విద్యార్థులకు, డ్రైవర్లకు, ప్రజలకు సవరించిన ట్రాఫిక్ శిక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు మహిళల రక్షణ చట్టాలపై తెలియజేస్తున్న సిఐ సన్యాసినాయుడు

మాగుర్ చేపలపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-రంపచోడవరం

మహా మాగుర్ అనే జన్యుపరంగా ఎంపిక చేసిన మాగుర్ చేపల గురించి రంపచోడవరం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఉత్తమ విధానాలు, స్థిరమైన పద్ధతులు, వినూత్న విధానాలు గురించి తెలియజేశారు. రైతుల ఆదాయాన్ని, ఉత్పత్తిని మెరుగుపర్చుకొనే పద్ధతులు గురించి వివరించారు. సాంకేతిక పురోగతుల ద్వారా మెరుగైన వనరుల వినియోగం, వ్యవసాయ వ్యవస్థ స్థిరత్వం, సమర్థవంతమైన మత్స్యకార విధానాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త రాజేందర్, డాక్టర్ వీరాంజనేయులు, డాక్టర్ జాగర్ టి. సుగుణ, డాక్టర్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నఫిసాకు నివాళి

ప్రజాశక్తి-అడ్డతీగల

లయ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ నఫిసా సంస్మరణ సభ, స్మారక చిహ్నం ప్రారంభ కార్యక్రమం శనివారం మండల కేంద్రం శివారు డొక్కపాలెం గ్రామ సమీపంలో గల వనంతరం కార్యాలయంలో జరిగింది. లయ సంస్థ డైరెక్టర్ సిద్ధార్థ డాక్టర్ నఫిసా స్మారక చిహ్నాన్ని ప్రారంభించారు. ఐదు మండలాలకు చెందిన మారుమూల గ్రామాల నుండి 150 మంది గిరిజనులు హాజరై డాక్టర్ నఫిసాకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వక్తలు జర్మనీ దేశానికి సంబంధించిన ఆశా కిరణ్ సంస్థ ప్రతినిధి బెనుధర్ సుదార్ భువనేశ్వర్ మాట్లాడుతూ నఫిసా, డామినిక్ ఆదివాసీలకు చేసిన అభివృద్ధిపై కొనియాడారు. ఈ కార్యక్రమంలో లయ సంస్థ కోఆర్డినేటర్ కోటేశ్వరరావు, బుల్లయ్య, చక్రి, దినేష్, రాజేష్ పాల్గొన్నారు.

డాక్టర్ నఫిసాకు నివాళులర్పిస్తున్న గిరిజనులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే జరిమానాలు

పలుచోట్ల నూతన వాహన చట్టంపై అవగాహనా కార్యక్రమాలు

ప్రజలతో మాట్లాడుతున్న సిఐ దీనబంధు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: మార్చి ఒకటి నుంచి రాష్ట్రంలో అమల్లోకి నూతన మోటారు వాహన చట్టం అమల్లోకి వచ్చిందని, దీని ప్రకారం నిబంధనలు కఠినంగా ఉంటాయని పాడేరు సిఐ డి.దీనబంధు తెలిపారు. శనివారం పాడేరులో నూతన మోటారు వాహన చట్టం అమలుపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ చట్టంతో జరిమాణాలు భారీగా పెరగనున్నాయని వివరించారు. ద్విచక్ర వాహనంపై వెళ్తూ హెల్మెట్ లేకపోతే వెయ్యి జరిమానా, బైక్ వెనుక కూర్చున్న వ్యక్తికి హెల్మెట్ లేకపోయినా వెయ్యి జరిమానా కట్టాల్సి వస్తుందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే 5వేలు, సెల్ ఫోన్ తో డ్రైవింగ్ కు 10వేలు జరిమానా విధిస్తారన్నారు. వాహానానికి భీమ లేకుంటే వెయ్యి, రెండోసారి దొరికితే 2 వేలు, శబ్దం, పొగ కాలుష్యానికి కారమైతే 2 వేల నుంచి 4 వేల రూపాయలు జరిమానా విధిస్తారని తెలిపారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సి తీరాల్సిందేనని, వాహనాల ఆల్ట్రేషన్, ఇష్టానుసార నెంబర్ ప్లేట్లు, ఇతరులకు ఇబ్బంది కలిగే విధంగా, ప్రమాదకర డ్రైవింగ్ చేయడం వంటి వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామన్నారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులు చిక్కుల్లో పడతారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక స్టేషన్ ఎస్ఐ ఎ.సూర్యనారాయణ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మోటార్ వాహన సవరణ నిభందనలను పక్కగా పాటించాలని ఎస్సై కె పాపినాయుడ సూచించారు. మండలంలోని చాపరాయి జలపాతం జాతీయ రహదారిలో వాహనదారులకు మోటార్ వాహన నిభందనలపై కరపత్రాలను పంచుతూ పోలీసులు అవగాహన కల్పించారు. హెల్మెంట్ ధరించి వాహనాలను నడపాలన్నారు. వాహన రికార్డులు కలిగి ఉండాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

చింతపల్లి:వాహనదారులు నిబంధనలు పాటించాలని స్థానిక సీఐ వినోద్ బాబు, ఎస్సై వెంకటేశ్వరరావు సూచించారు. పెంచిన అపరాధ రుసుముల వివరాలను శనివారం విలేకరుల సమావేశంలో వివరించారు. వాహనాలు నడిపేవారు.. తమతోపాటూ.. ఆర్సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ పత్రాలు, పొల్యూషన్ రిసీట్ ఇలా అన్ని పత్రాలూ తమతో తీసుకెళ్లాలన్నారు.

అనంతగిరి:కొత్త మోటారు చట్టం నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అరుకు సీఐ హిమగిరి తెలిపారు. మండలంలోని కాశీపట్నం మోటార్ ఫీల్డ్ సిబ్బంది స్థానిక ప్రజలకు చట్టాలపై సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చట్టాలకు విరుద్ధంగా వాహనాలు నడిపిన డ్రైవర్లపై అపరాధ రుసుములు విధించడం తప్పదని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎల్. శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్ వైకుంఠం, మోటార్ ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీలేరు:నూతన మోటార్ వెహికల్ చట్టంపై జీకే వీధిలో శనివారం సిఐ వరప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వాహన చట్టం ప్రకారం ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితో పాటు వెనక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ ధరించాలని, లేకుంటే వెయ్యి రూపాయలు జరిమానా విధించబడుతుందని చెప్పారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.10వేలు, వాహానానికి బీమా లేకపోతే మొదటి సారి రూ.1000, రెండోసారి పట్టుబడితే రూ.2000 జరిమానా విధించబడతాయని తెలిపారు. వాహనదారులు శబ్ధ పొగ కాలుష్యానికి పాల్పడితే రూ.2000 నుంచి రూ.4000 జరిమానా, డేంజర్ పార్కింగ్ వాహనాలు చేస్తే రూ.1500 నుంచి రూ.3000 అపరాధ రుసుము విధించనున్నట్లు చెప్పారు. ఓవర్ స్పీడ్ నడిపితే రూ.5000, డేంజరస్ డ్రైవింగ్ చేస్తే రూ.10,000, మైనర్ డ్రైవింగ్ చేస్తే వెయ్యి రూపాయలు, ప్రయాణికులను రవాణా వాహానాల్లో ఎక్కిస్తే మనిషికి రూ.200 చొప్పున జరిమానా విధిస్తామని తెలిపారు.

సీలేరు : ఆంధ్రప్రదేశ్ నూతన వాహన చట్టం మార్చి ఒకటి నుండి అమల్లోకి వచ్చిందని, ఈ చట్టం నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని సీలేరు ఎస్సై కె.రవీంద్ర అన్నారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబంధనలను అనుసరించి వాహానాల నడుపుకోవాలని సూచించారు.

అడ్డతీగల : ట్రాఫిక్ నిబంధనలపై మండల కేంద్రంలో గల సీతపల్లి సెంటర్ వద్ద ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అడ్డతీగల సిఐ బి.నరసింహారావు శనివారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ కంట్రోల్ సంబంధించి కొత్త విధివిధానాలు, జరిమానాలు గురించి వాహనదారులకు అర్థమయ్యే విధంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుచ్చెర్తి ఎస్సై ఎం.వెంకయ్య పాల్గొన్నారు.

కొయ్యూరు : ప్రతి ఒక్కరు లైసెన్సు కలిగి ఉండాలని లేకుంటే రూ.5000 వరకు జరిమానా విధిస్తామని కొయ్యూరు సీఐ వెంకటరమణ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, ద్విచక్ర వాహనాలు, కార్లు, వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కొయ్యూరు ఎస్సై కిషోర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సీతపల్లి సెంటర్లో అవగాహన కల్పిస్తున్న సిఐ నరసింహారావు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం చెందిన ఘటన శనివారం సాయంత్రం బిఆర్టిఎస్ రహదారి దారపాలెం సమీపంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... ఆనందపురంలో నివాసముంటున్న గెడ్డం సావిత్రి(62) శనివారం సాయంత్రం బిఆర్టిఎస్ రహదారిలో ఎస్ఎస్ఎన్.నగర్లోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నారు. అడవివరం నుంచి ముడసర్లోవ వైపు స్పీడుగా వస్తున్న స్కార్పియో కారు సావిత్రిని బలంగా ఢీకొట్టి, సుమారు 100 మీటర్ల వరకు ఈడ్చుకుపోయింది. దీంతో సావిత్రి అక్కడికక్కడే మృతిచెందారు. ఢీకొట్టిన కారు ఆపకుండా యూటర్న్ తీసుకొని తిరిగి అడివివరం వైపు వెళ్లిపోయింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలను నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతురాలు సావిత్రి ఎస్ఎస్ఎన్నగర్లో ఉన్న చెల్లెలు ఇంటికి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. సావిత్రికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -గాజువాక : దుర్గానగర్లో అక్రమంగా ఉంచిన పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన విజయ్ గాంధీ, తెలంగాణకు చెందిన గణేష్ 330 బస్తాల బియ్యాన్ని అక్రమంగా నిలువ చేశారని అధికారులు తెలిపారు. వీరిద్దరిపై గాజువాక పోలీసులకు సివిల్ సప్లై అధికారులు ఫిర్యాదు చేశారు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల శ్రద్ధ వహించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని మండల గిరిజన సంక్షేమశాఖ సహాయ అధికారి మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని అడపవలస గిరిజన ప్రాథమిక పాఠశాలలో ఆయన శనివారం సందర్శించారు. మధ్యాహ్న భోజన మెనూతోపాటు చిన్నారుల అభ్యసన ప్రగతి, రికార్డులను పరిశీలించారు. ప్రాథమిక స్థాయిలోనే చిన్నారులకు చదువులపై ఉపాధ్యాయులు మక్కువ చూపించాలన్నారు. ఆటలు, పాటలతోపాటు శారీరకంగా, విద్య ప్రగతిని చిన్నారులకు అందించాలని ఆయన సూచించారు.

రూ.2 లక్షల బీమా అందజేత

ప్రజాశక్తి-అరకులోయరూరల్:ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం లబ్దిదారులు నామిని జనం అప్పన్నకు రూ.2 లక్షల నగదు బీమాను శనివారం అరకులోయ ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్ ఎన్ రాజేంద్రప్రసాద్ అందజేశారు.ఇటీవల కాలంలో అరకులోయ మండలం లోతేరు పంచాయితీ శిరసగూడ గ్రామానికి చెందిన జనం డలిమ్మ మృతి చెందింది.ఆమె ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన ఖాతాదారు కావటంతో ఆ మొత్తం రూ.2లక్షలు ఆమె భర్తకు అందజేశారు. పీఎంజేజేబీవై పథకానికి 436 రూపాయిలు ఏడాదికి చెల్లించి బీమా పథకం తీసుకుంటే ప్రమాదవశాత్తు మరణిస్తే నామిని కి రెండు లక్షల రూపాయలు భీమా వస్తాయని బ్యాంకు మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీజీవీబి బ్యాంక్ మిత్ర సభ్యులు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కును అందజేస్తున్న మేనేజర్ రాజేంద్రప్రసాద్

గీతం ఐటిబిఐ ప్రాజెక్ట్ ప్రారంభం

ప్రజాశక్తి -మధురవాడ

జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్ర సింగ్ న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో డిఎస్టి-గీతం ఇన్క్లూజివ్ టెక్నాలజీ బిజినెస్ ఇన్క్యుబేటర్ (ఐటిబిఐ) ప్రాజెక్ట్ను ప్రారంభించారు. కృత్రిమ మేధస్సు (ఎఐ), మెషిన్ లెర్నింగ్ రంగాల్లో పరిశోధన, పారిశ్రామిక వృద్ధిని ప్రోత్సహించడం ద్వారా విశాఖపట్నంలో బలమైన స్టార్టప్ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఈ ప్రాజెక్ట్కు భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం ద్వారా రూ. 4.57 కోట్లు మంజూరయ్యాయి.

గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సిఎస్ఇ విభాగాధిపతి, గీతం ఐటిబిఐ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ పి.భరణి చంద్ర కుమార్ మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ఫలితాలు పరిశ్రమలకు ఎంతో ఉపయోగకరంగా ఉండబోతున్నాయని, నైపుణ్యం కలిగిన మానవ వనరులను సమకూర్చేందుకు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ను గీతం యూనివర్శిటీకి మంజూరు చేసినందుకు భారత ప్రభుత్వానికి గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి

నినాదాలు చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ పివిటిజి గ్రామమైన లింబగుడ గ్రామంలో దండబాడు నుండి లింబగుడ వరకు మంజులైన తారు రోడ్డు పనులు వెంటనే నిర్మాణం ప్రారంభించాలని గ్రామస్తులు శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 90 లక్షల రూపాయలతో మంజూరైన తారు రోడ్డు పనులు ప్రారంభించి వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.రెండు రోజులు మట్టి పనులు చేసి గుత్తేదారుడు మధ్యలో పనులు నిలిపివేశారన్నారు. కాంట్రాక్టర్ను పనులు ఎందుకు నిలిపివేశారని అడిగితే ఫారెస్ట్ అధికారులు ఈ రోడ్డుకి ఫారెస్ట్ అనుమతులు లేదని చెప్పడంతో నిలుపుదల చేశామని చెప్పారన్నారు.అభివృద్ధికి దూరంగా ఉన్న పివిటిజీలకు జన్మన్ హౌసింగ్ మంజూరు అయ్యిందని, రోడ్డు సౌకర్యాలు లేక ఐరెన్ , సిమెంట్ , ఇసుక , ఇటుక వివిధ ముడి సరుకులు తెచ్చుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో పాంగి రాజు, మదు, రంజిత్, బాబురావు,సింగో,సుంద్ర, సరుబు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న హరేంధిర ప్రసాద్

అన్ని సదుపాయాలున్నా..

మాతా శిశు మరణాలకు కారణాలేంటి ?

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అన్ని రకాల సదుపాయాలు, వసతులు, ఆధునిక సాంకేతిక వైద్య పరిజ్ఞానం ఉన్నప్పటికీ మాతా శిశు మరణాలు ఎందుకు సంభవిస్తున్నాయని వైద్యాధికారులను, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూటిగా ప్రశ్నించారు. గత ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య కాలంలో జిల్లాలోని వివిధ ఆసుపత్రుల పరిధిలో చోటుచేసుకున్న మాతా శిశు మరణాలపై శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు. ఒక్కొక్క ఘటన తాలూకా పూర్వాపరాలను తెలుసుకున్నారు. ఈ నాలుగు నెలల కాలంలో మొత్తం ఎనిమిది దుర్ఘటనలు చోటు చేసుకున్నాయని, అందులో ఐదుగురు తల్లులు, ముగ్గురు పిల్లలు వివిధ అనారోగ్య కారణాలతో మృత్యువాత పడ్డారని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు వివరించారు. ఆయా రోగుల విషయంలో వైద్యులు పాటించిన నియమాలు, తీసుకున్న చర్యలు, ఇతర అంశాల గురించి కలెక్టర్కు నివేదించారు.

నాలుగు నెలల కాలంలో సంభవించిన మాతా శిశు మరణాలపై కలెక్టర్ స్పందిస్తూ ఆధునిక వసతులు ఉన్నప్పటికీ ఇలా జరగడం శోచనీయమని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కావడానికి వీల్లేదని నిర్దేశించారు. రోగుల స్థితిగతులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, దానికి తగ్గ చర్యలు చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఆధునిక వసతులు కలిగిన ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులు ఉన్నాయని, ఇలాంటి చోట మనుషులను కోల్పోవడం బాధాకరమని, దీనిపై వైద్యాధికారులు, సిబ్బంది పున్ణపరిశీలన చేసుకోవాలని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో డిఐఒ లూసీ, డిసిహెచ్ఎస్ శంకర్ ప్రసాద్, డిఎంఒ తులసి, ఎన్టిఆర్ వైద్య సేవ జిల్లా కో-ఆర్డినేటర్ అప్పారావు, కెజిహెచ్, వివిధ ప్రయివేటు ఆసుప్రతుల వైద్యులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రజల కోసం న్యాయ పోరాటం చేస్తామని, అక్రమ అరెస్టులకు భయపడేది లేదని వైసిపి విశాఖ దక్షిణ నియోజకవర్గం కో - ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. దక్షిణ నియోజకవర్గ చేనేత విభాగ అధ్యక్షురాలు కాకి పద్మ శనివారం ఆశీలుమెట్టలో వాసుపల్లి గణేష్ కుమార్ను ఆయన కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి బెదిరింపులకు ఎవరూ లొంగవద్దన్నారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్ పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్టులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవతరానికి స్త్రీ శక్తి నాంది అని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సతీమణి శుభోశ్రీ బాగ్చి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శనివారం విజెఎఫ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మహిళా మీడియా ప్రతినిధుల సత్కార కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వానిరి విశిష్ట ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వ మనుగడలో స్త్రీ పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. గౌరవ అతిథిగా హాజరైన సిఐడి ప్రాంతీయ ఉన్నతాధికారి ప్రేమ్ కాజల్ మాట్లాడుతూ నేడు అన్ని రంగాలలో మహిళలు మగవారితో పోటీపడుతూ సత్ఫలితాలను సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, సీనియర్ జర్నలిస్ట్, జాతీయ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజు పట్నాయక్, కార్యక్రమ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి ఈశ్వరీయ మెడిటేషన్ ఇన్ఛార్జి బికె రామేశ్వరి పాల్గొన్నారు.

ఎయును మేటిగా నిలుపుతా

విసిగా బాధ్యతల స్వీకరణలో ఆచార్య జిపి.రాజశేఖర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయిలో మేటిగా నిలపడం, పూర్వవైభవాన్ని సంతరించుకునేలా చేయడం తనముందున్న లక్ష్యాలని ఆచార్య జిపి.రాజశేఖర్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతిగా ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు. తదుపరి అవినీతికి స్థానం కల్పించబోమంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాల్స్, ఇతర అధికారులు పాల్గొన్నారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా ఎయు కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్లు, ఇతర అధికారులతో అకడమిక్ సెనేట్ మందిరంలో విసి రాజశేఖర్ సమావేశమయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాసంస్థల కన్నా ఎయు ఎంతో పెద్దదని అన్నారు. ఎందరో మహనీయుల కృషి, స్ఫూర్తి ఫలితంగా నేడు యూనివర్సిటీ ఇంతటి ఉన్నత స్థానంలో నిలిచిందని చెప్పారు. అందరి సహకారం, ఆశీస్సులు తనకు కావాలని కోరారు. ప్రభుత్వం తనకు ఈ బాధ్యత అప్పగించిందని, పదవుల కంటే అకడమిక్స్ ఎంతో ప్రధానమని చెప్పారు. ఈ ప్రక్రియలో చాలా సవాళ్లు ఉన్నాయని తెలిపారు. విద్యలో అనేక సంస్కరణలు చోటు చేసుకుంటాయని చెప్పారు. నేడు అధునాతన సాంకేతికతలు విస్తృతంగా అభివృద్ధి చెందుతున్నాయని, అదే సమయంలో కోర్ సబ్జెక్టులను విస్మరించడం సరికాదని తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను కల్పిస్తూ మంచి కరికులం రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. విశ్వవిద్యాలయాన్ని కేంద్రీయ, అంతర్జాతీయ విద్యా సంస్థలతో సమన్వయం చేస్తూ వనరులు, నిధులు పెంపొందించే దిశగా కృషి చేస్తామని అన్నారు. ఎయు శతాబ్ది సంవత్సరంలోకి వెళుతోందని, దీనికి అవసరమైన ప్రణాళికను రూపొందించి సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని గ్రామీణ ప్రాంతాలకు అనుసంధానం చేస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత విద్యను చదువుకునే దిశగా నడిపించడానికి కృషి చేస్తానని అన్నారు. విద్యార్థుల కోసం కేంద్రీయ విశ్వవిద్యాలయాల తరహాలో లీడర్షిప్ అకాడమీ ఏర్పాటుకు పనిచేస్తానన్నారు. విశ్వవిద్యాలయాన్ని పరిశ్రమలతో అనుసంధానిస్తామని, ఇండస్ట్రియల్ కాంక్లేవ్లు నిర్వహిస్తామని చెప్పారు.

విసిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రాజశేఖర్

నిరుద్యోగ యువత ఆందోళన బాట

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నేటి యువతను పట్టిపీడిస్తున్న భూతం నిరుద్యోగం అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ సమస్య పరిష్కారానికి పాలకులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. దీంతో విశాఖ నగరంలో యువత ఆందోళన బాట పట్టడం ఇటీవల చూస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ గురించిన స్పష్టత కూడా ఇంతవరకూ ఇవ్వలేదు. గడచిన ఐదేళ్లలో కొత్త పరిశ్రమలు రాకపోవడం, సంస్థల రంగ ప్రవేశం లేకపోవడం, ఐటి కంపెనీలు సైతం విశాఖకు ముఖం చాటేయడంతో చదువుకున్న యువత పెడదారి పట్టిందని పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. నిర్దిష్టంగా విశాఖ ఉమ్మడి జిల్లాలో గంజాయికి, ఇతర చిల్లర నేరాలకు అలవాటుపడిన వారిలో 40 శాతానికిపైగా యువతే ఉన్నారని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అధికారం ఇస్తే వారం రోజుల్లో నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామంటూ హామీలు గుప్పించి పాలన చేపట్టి ఏడాది సమీపిస్తున్నా ఆ దిశగా చంద్రబాబు సర్కారు ఒక్క అడుగూ వేయకపోవడం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. డిఎస్సిపై ఏళ్ల తరబడి ఆశలు పెట్టుకున్న యువతను రాష్ట్ర ప్రభుత్వం మోసగించినట్టయింది. తొలి సంతకం ఈ ఫైలుమీద చంద్రబాబు చేసినా ఫలితం లేకపోయింది. 8 నెలలు దాటిపోయినా డిఎస్సికి ఉలుకూ పలుకూ లేదు. సుమారు 16 వేల మేర టీచర్ పోస్టులు భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు ప్రకటన చేసి తర్వాత 'కూటమి' తుష్ మనిపించింది.

ఉన్న స్టడీ సర్కిల్ మూత

నగరంలోని రుషికొండ వద్ద గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏటా 200 మందికి పైగా ఎస్సీ, ఎస్టీ, బిసి విద్యార్థినీ విద్యార్థులకు సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు తర్ఫీదు నివ్వడంలో విశేష కృషి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన మరుక్షణం ఈ స్టడీ కేంద్రాన్ని మూసివేయించింది. విశాఖ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ నిర్వహణలో జరిగే ఈ ప్రక్రియకు బ్రేకులు పడ్డాయి. దీంతో ఏడాది కాలంగా ఇక్కడ ఎలాంటి శిక్షణా ఇవ్వనందున నిరుద్యోగుల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు అలముకుంటున్నాయి. అనేక మంది యువత ఇక్కడ నుంచి ఎపిపిఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉద్యోగాలు పొందిన ఉదంతాలు ఉన్నా దీన్ని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందన్న విమర్శలున్నాయి. విధి విధానాలను వెంటనే తయారు చేసి దీన్ని ఆచరణలో పెట్టాలన్న డిమాండ్ యువత నుంచి వినిపిస్తోంది.

భర్తీ జరగాల్సిన ఖాళీలు లేవా ?

సుమారు 1.40 లక్షల ఉద్యోగ ఖాళీలు రాష్ట్రంలో ఉన్నా వాటి జోలికి ప్రభుత్వం వెళ్లడం లేదు. అరకొర ప్రకటనలతోనే కాలం వెళ్లదీస్తూ వస్తోందన్న విమర్శలు యువత నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల గ్రూప్ 2 పరీక్షల నిర్వహణపై పలుచోట్ల ఆందోళనలు రేగాయి. ముఖ్యంగా విశాఖలో చదువుకున్న యువత రోస్టర్ సవరించాలంటూ తారా స్థాయికి ఈ ఉద్యమాన్ని తీసుకెళ్లింది. ప్రభుత్వం నుంచి సరైన స్పందన కానరాలేదు. తాజాగా రాష్ట్ర బడ్జెట్లో యువతకు ఏమాత్రమూ ప్రాధాన్యతనివ్వలేదు. నిరుద్యోగ భృతికి ఎగనామం పెట్టారు. నియోజకవర్గాల వారీగా నిరుద్యోగ యువతను గుర్తించి వారి జాబితాలను తయారు చేసి మరీ భృతి ఇస్తామన్న 'కూటమి' పెద్దల మాటలు నీటి మూటలయ్యాయి.

పింఛన్ డబ్బులను అందజేస్తున్న పిఒ కట్టా సింహాచలం

పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం మండలం నరసాపురం గ్రామంలో సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం శనివారం పరిశీలించి, లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇళ్లకు వెళ్లి అందజేయడం జరుగుతుందని తెలిపారు. పింఛన్ల పంపిణీలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మాదిగ అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి ఎస్సీ కాలనీ కమ్యూనిటీ భవనం వద్ద శనివారం అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు మోర్త బుజ్జిబాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై అశువుల బాసిన మాదిగ అమరవీరుల సేవలు మరువలేనివని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.నూకరాజు, ఏ అనిల్, కె దుర్గాప్రసాద్, ఎం చిన్న, ప్రశాంత్, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మోసపూరిత బడ్జెట్ : వైసిపి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ చంద్రబాబు మార్క్ వంచన, మోసానికి ప్రతిబింబంగా ఉందని, ప్రభుత్వంపై ఆధారపడిన పేద బలహీనవర్గాల జీవన ప్రమాణాలు పెంచే విధంగా ఈ బడ్జెట్ కనిపించడం లేదని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ విమర్శించారు. శనివారం ఉదయం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏపీ అంటే అమరావతే అన్నట్టు అమరావతి అభివృద్ధికి బడ్జెట్లో రూ.6 వేల కోట్లు కేటాయించి, రాష్ట్రంలో వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు 9 నెలల పాలనపై ఇప్పటికే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత మొదలైందని, అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని అన్నారు. అధికారంలోకి రావడం కోసం సూపర్ సిక్స్ను వాడుకున్నారేకానీ అమలు చేయడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్టు కనిపించడం లేదని అన్నారు. అన్నదాత సుఖీభవ కింద కేంద్రం ఇచ్చేది కాకుండా, రూ.20 వేలు చొప్పున ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చడం దుర్మార్గమన్నారు. కేంద్రం నుంచి తెచ్చుకోవాల్సిన నిధులను కూడా సాధించుకోలేని చేతకాని స్థితిలో చంద్రబాబు ఉన్నారన్నారు. గ్రూప్ - 2 నిర్వహణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు.

నీలమ్మ వేపచెట్టు హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 31వ వార్డు పరిధి అస్సాం గార్డెన్స్లోని శ్రీ నీలమ్మ వేపచెట్టు దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం జరిగింది. దేవస్థానంలో మహాశివరాత్రి వేడుకలు ముగిసిన నేపథ్యంలో గత ఏడాది డిసెంబర్ 10వ తేదీ నుండి ఈ ఏడాది మార్చి ఒకటి వరకు హుండీలు లెక్కించగా రూ.2 లక్షలా 23 వేలా 85 ఆదాయం వచ్చిందని దేవస్థానం కార్య నిర్వహణ అధికారి జివి.రమాబాయి మీడియాకు తెలిపారు. శ్రీ కరకచెట్టు పోలమాంబ అమ్మవారి దేవస్థానం ఇఒ కొవ్వూరి గాయత్రి పర్యవేక్షకులుగా హుండీ లెక్కింపు కార్యక్రమం జరిగిందన్నారు.